క్లుప్తంగా

ఊరి బయట టపాసుల విక్రయాలు జరపండి

ములకలచెరువు : దీపావళి పండుగ సందర్భంగా అనుమతులు పొందిన దుకాణ యజమానులు ఊరి బయట టపాసుల విక్రయాలు జరిపాలని అగ్నిమాపక అధికారి సుబ్బరాజు ఆదేశించారు. బుధవారం ఆయన ములకలచెరువు సర్కిల్ పరిధిలోని పలు మండలాల్లో ఏర్పాటు చేసిన దుకాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని ఐదు మండలాల్లో 23 దుకాణాలకు అనుమతులు పొందినట్లు చెప్పారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చూసుకోవాలని యజమానులకు సూచించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

కలికిరి : కొర్లకుంట గ్రామం బెస్తపల్లి వద్ద నూతనంగా నిర్మించిన అంకాళమ్మ ఆలయంలో బుధవారం భక్తిశ్రద్ధలతో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట చేశారు. ఈ సందర్భంగా ఉదయం గణపతి హోమం, మహాకుంభాభిషేకం నిర్వహించారు. పండితుల మంత్రోచ్ఛరణల మధ్య మూలవిగ్రహ ప్రాణప్రతిష్ట గావించారు. అనంతరం ప్రత్యేక పూజలు, అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాల వినియోగం చేశారు.

హౌసింగ్ లబ్ధిదారులకు రుణాలివ్వాలి

కలికిరి : ఎస్‌హెచ్‌జీలలో సభ్యత్వం కలిగిన హౌసింగ్ లబ్ధిదారులు త్వరితగతిన ఇండ్లు నిర్మించుకోవడానికి రుణాలివ్వాలని ఎంపీడీఓ భానుమూర్తి అన్నారు. హౌసింగ్, ఏపీఎం, ఏపీఓలతో బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు నిర్మాణాలకు వీలుగా అన్ని శాఖల సమన్వయంతో అధికారులు కృషి చేయాలన్నారు. ఉపాధి హామీ పథకంలో హౌసింగ్ లబ్ధిదారులకు 90రోజులు పని దినాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీఓ సుజాత, ఏపీఎం దేవసేన, టీఏలు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి గ్రామసభలు

తంబళ్లపల్లె : మండలంలో భూముల సంబంధిత సమస్యలు పరిష్కరించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ రవీంద్రనాయక్ తెలిపారు. బుధవారం కన్నెమడుగులో ఉప సర్పంచు శివమ్మ అధ్యక్షతన గ్రామసభ జరిగింది. రైతులు సుమారు 107 సమస్యలకు సంబంధించి అర్జీలు అందజేశారు. అర్జీలను పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో మండల సర్వేయర్ నరేంద్ర, వీఆర్‌ఓ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

గుర్రంకొండ : నూతనంగా బదిలీపై వచ్చిన వీఆర్‌ఓలు బాధ్యతలు స్వీకరించినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అమిలేపల్లె, మర్రిమాకులపల్లె క్లస్టర్ వీఆర్‌ఓగా ఫకీర్‌షావలీ, అరిగెలవారిపల్లె, శెట్టివారిపల్లె క్లస్టర్ వీఆర్‌ఓగా నారాయణ, తరిగొండ వీఆర్‌ఓగా వెంకటరమణ, ఎల్లుట్ల వీఆర్‌ఓగా నాగరాజ, మర్రిపాడు వీఆర్‌ఓగా బి.కృష్ణమూర్తి, నడికంద్రిగ వీఆర్‌ఓగా సంజీవనాయక్, సరిమడుగు వీఆర్‌ఓగా భాగ్యలక్ష్మీ, చెర్లొపల్లె వీఆర్‌ఓగా నీలిమా, టి.పసలవాండ్లపల్లె వీఆర్‌ఓగా శ్రీనివాసులు నాయుడు, సంగసముద్రం వీఆర్‌ఓగా శంకర్, గుర్రంకొండ-1 వీఆర్‌ఓగా సదాశివప్పనాయుడు, గుర్రంకొండ-2 వీఆర్‌ఓగా భరత్‌నాయక్, ఖండ్రిగ వీఆర్‌ఓగా అమీరుల్లాలు బాధ్యతలు స్వీకరించినట్లు ఆయన పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించండి


సమావేశంలో సమస్యలు తెలియజేస్తున్న సభ్యులు

కలకడ : ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశంలో గ్రామాల వారి సమస్యలను తెలియజేసి, వాటికి పరిష్కారం చూపాలని సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో తహసీల్దార్ ఫణికుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో బాస్ నేత పాలకుంట శ్రీనివాసులు గత సమావేశంలోని సమస్యలు ఎన్ని పరిష్కరించారు, ఎన్ని పరిష్కారం కాలేదు జాబితా ఇవ్వాలని కోరారు. తహసీల్దార్ స్పందించి అధికారులు మారడం వలన, ఎన్నికల ప్రక్రియలో ఉండటం, బదిలీలు జరగడంతో గతంలో తెలిపిన సమస్యలు పరిష్కారం కాలేదని, నేడు ఇచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించడం జరుగుతుందన్నారు. కలకడలోని పశువుల ఆసుపత్రికి ఉన్న దారిని, అంకాలమ్మ చెరువును అక్రమార్కులు ఆక్రమించారని అయినా రెవెన్యూశాఖ అధికారులు స్పందించలేదని ఆరోపించారు. తహసీల్దార్ ఫణికుమార్ రెవెన్యూ సమస్యలు, ఆక్రమణలపై రాతపూర్వకంగా సమాచారం అందిస్తే వెంటనే పరిశీలించి ఆక్రమణలు తొలగించడం, అవసరమైతే కేసులు పెట్టడం జరుగుతుందన్నారు. మండలానికి 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు, పంచాయతీల వారి ఎంత ఖర్చు చేశారు వివరాలను కోరారు. మండలంలోని ఎస్సీ, ఎస్టీలకు స్మశాన వాటికలు లేవని, స్థలం కేటాయించి, రెవెన్యూ రికార్డులలో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కలకడ పీహెచ్‌సీలో వైద్యులు చిన్నచిన్న ఆరోగ్య సమస్యలను రెఫర్ చేయడం దారుణమన్నారు. ఎస్సీ, ఎస్టీ కాలనీలకు హరిజనవాడ, ఎరుకల కాలనీ, హరిజన, గిరిజన అనే పేర్లు మార్పు చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్నా మండలంలో అమలుకు నోచుకోలేదని గుర్తు చేశారు. మండల పరిధిలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు, భవణ నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అబ్దుల్‌రహీమ్, ఎంఈఓ మునీంద్రనాయక్, ఏపీఓ చెన్నకేశవులు, అన్నిశాఖల అధికారులు, సంఘం సభ్యులు పాలకుంట నరసింహులు, శ్రీనివాసులు, వంగిమల్ల హరినాథ, దామోదర్, జీవి రమణ, పాలకుంట చౌడప్ప, రజిని, ఓబులేశు, రెడ్డెయ్య తదితరులు పాల్గొన్నారు.

దళితుల భూ ఆక్రమణలపై స్పందన


బాధితుల వద్ద వివరాలు తెలుసుకుంటున్న ఎస్సీ కార్పొరేషన్ ఈఓ కుముదా

కేవీపల్లె : మండలంలో తిమ్మాపురంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా దళితులకు పంపిణీ చేసిన భూములు ఆక్రమణకు గురయ్యాయని సీపీఐ నాయకులు చేసిన ఫిర్యాదుతో ఎస్సీ కార్పొరేషన్ అధికారులు పరిశీలన చేపట్టారు. బుధవారం ఎస్సీ కార్పొరేషన్ ఈవో కుముదా తిమ్మాపురంలో పర్యటించి ఆక్రమణకు గురైన భూముల గూర్చి బాధితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్. వెంకటేష్ మాట్లాడుతూ దళితుల భూములు గ్రామానికి చెందిన రవీంద్రనాథ్ రెడ్డి కొంతమంది బినామీ పేర్లతో ఆక్రమించుకున్నాడని అధికారుల దృష్టికి తెచ్చారు. ఎస్సీ కార్పొరేషన్ ఈవో మాట్లాడుతూ పరిశీలన నివేదిక ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దళితులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు


బాస్కెట్‌బాల్ విన్నర్స్‌గా విజయం డిగ్రీ కాలేజీ విద్యార్థులు


బాల్‌బాడ్మింటన్ విన్నర్స్‌గా ఎస్వీయూ కాలేజీ విద్యార్థులు

మదనపల్లె సిటీ : విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎస్వీ యూనివర్శిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ ఎం.శివశంకర్‌రెడ్డి అన్నారు. స్థానిక బీటీ కాలేజీలో బుధవారం మూడవ విడత యూనివర్శిటీ గేమ్స్ ముగిశాయి. క్రీడల్లో గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలన్నారు. చిన్నప్పటి నుంచి క్రీడల్లో ప్రావీణ్యం సంపాదించాలన్నారు. అనంతరం గెలుపొందిన విజేతలకు ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ క్రిష్ణవేణి, పీడీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. బాస్కెట్‌బాల్ విభాగంలో విజేతలుగా విజయం డిగ్రీ కాలేజీ (చిత్తూరు), రన్నర్స్‌గా వీసీఆర్ డిగ్రీ కాలేజీ (చిత్తూరు) నిలిచారు. బాల్ బ్యాడ్మింటన్ విభాగంలో విజేతలుగా ఎస్వీయూ కాలేజీ(తిరుపతి), రన్నర్స్‌గా ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ (తిరుపతి) నిలిచారు. హ్యాండ్‌బాల్ విభాగంగా విన్నర్స్‌గా సీకాం(తిరుపతి), రన్నర్స్‌గా బీఎస్ఆర్ డిగ్రీ కాలేజీ (తిరుపతి) నిలిచారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ


మృతుని కుటుంబ సభ్యులతో మట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల

కేవీపల్లె : మండలంలోని గోరంట్లపల్లె పంచాయతీ యర్రదొడ్డిగారిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు పద్మనాభరెడ్డి సతీమణి బి.పద్మిని (గుణసుందరి) మృతి చెందింది. విషయం తెలుసుకున్న తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి యర్రదొడ్డిగారిపల్లెకు చేరుకుని పద్మిని మృతదేహం వద్ద నివాళులర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి, నాయకులు పి. ద్వారకనాథరెడ్డి, వెంకటసిద్ధులు, దినేష్‌రెడ్డి, నాగేశ్వర, పెద్దసిద్ధయ్య, రఘునాథరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దీపావళి శుభాకాంక్షలు


నిసార్‌అహ్మద్

మదనపల్లె : చీకటి మీద వెలుగు, చెడుమీద మంచి, దుష్టశక్తుల మీద దైవశక్తి సాధించిన విజయానికి దీపావళి ప్రతీక అని మదనపల్లె నియోజకవర్గ ప్రజలకు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. దీపావళి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. దీపావళి పండుగ సందర్భంగా టపాకాయలు పేల్చేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలందరూ ఆనందంగా, సుఖసంతోషాలతో దీపావళి జరుపుకోవాలన్నారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్ తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌చైర్మన్‌లు జింకా చలపతి, నూర్‌ఆజం, ఎంపీపీ రెడ్డెమ్మ, జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పోలీసు అమరుల త్యాగాలు వెలకట్టలేనివి


క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న డీఎస్పీ కొండయ్యనాయుడు, పోలీసు సిబ్బంది

మదనపల్లె : పోలీసు అమరుల త్యాగాలు వెలకట్టలేనివని, వారి సేవలను గుర్తించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని డీఎస్పీ డి.కొండయ్యనాయుడు అన్నారు. బుధవారం సాయంత్రం పోలీసు అమరవీరుల సంస్మరణదినం ముగింపు సందర్భంగా పట్టణంలో బాలికల జూనియర్ కాలేజీ, జెడ్పీ ఉన్నత పాఠశాల, అంబేడ్కర్ సర్కిల్ తదితర ప్రాంతాల్లో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. దేశంలో ప్రజల సంరక్షణకు ఏడాది కాలంగా 214 మంది పోలీసులు తమ ప్రాణాలను కోల్పోవడం జరిగిందన్నారు. శాంతిభద్రతలను కాపాడుకుంటూ అభివృద్ధి పథంలో దూసుకువెళుతున్నామన్నారు. కార్యక్రమంలో సీఐలు చాంద్‌బాషా, రమేష్, కళా వెంకటరమణ, రామచంద్ర, ఎస్.ఐ చంద్రమోహన్, అన్సర్‌బాషా, రహీముల్లా, రవికుమార్, ఎన్‌సిసి విద్యార్థులు పాల్గొన్నారు.

1న దీపావళి అమావాస్య నోములు

మదనపల్లె సిటీ : దీపావళి అమావాస్య నోములు శుక్రవారం నిర్వహించనున్నట్లు యోగభోగేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు విశ్వేశ్వరప్రసాద్ తెలిపారు. ఉదయం 8 గంటలకు కేదారేశ్వరవ్రతం ప్రారంభమవుతుందన్నారు. నోములవ్రతం ఆచరించే వారు నోములు నోచుకోవచ్చునన్నారు.

గ్రామాల అభివృద్ధికి సహకరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రెడ్డెమ్మ

మదనపల్లె : గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీపీ రెడ్డెమ్మ, ఎంపీడీఓ మస్తాన్‌వలీ కోరారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రెడ్డెమ్మ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ప్రభుత్వ పథకాలను ప్రజాప్రతినిధులకు తెలియజేశారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై అధికారులు స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు కోరారు. తహసీల్దార్ ఖాజాబీ మాట్లాడుతూ మండలంలోని 9 గ్రామాల్లో రీసర్వే జరిగిందని, గతంలో నిర్వహించిన సర్వేలో తప్పులు దొర్లడంతో వాటిని సరిదిద్దేందుకు ప్రస్తుతం గ్రామసభలు నిర్వహిస్తున్నామని, రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశుసంవర్ధకశాఖ అధికారి ప్రసాదరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పశుగణన కార్యక్రమం ప్రారంభమైందని, మండలంలో పశుగణనకు ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. సీటీఎం గ్రామంలో ఇళ్లస్థలాలు మంజూరైన లబ్ధిదారులు కొంతమందికి రెవెన్యూ అధికారులు పట్టాలు ఇవ్వాల్సి ఉందని సర్పంచ్ ఆనంద పార్థసారధి కోరారు. అంకిశెట్టిపల్లె గ్రామంలో రీసర్వేలో పలు తప్పులు దొర్లాయని, వెంటనే సవరించాల్సిందిగా సర్పంచ్ శరత్‌రెడ్డి, వైస్ ఎంపీపీ డిష్ రమణ కోరారు. మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాల్సిందిగా ఎంపీపీ రెడ్డెమ్మ కోరారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు వెలుగుచంద్ర, వైస్ ఎంపీపీ నందిని, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి


పరికరాలను అందజేస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్

రాయచోటి : జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రసవాల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ప్రసవాలలో మెరుగైన ఫలితాలను సాధించిన పీహెచ్‌సీ వైద్యాధికారులకు కలెక్టర్ వైద్య పరికరాలను అందజేశారు. వైద్యసేవలలో భాగంగా నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ సూచించారు. ఒక్క మాతా శిశు మరణం కూడా సంభవించరాదని తెలియజేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ ఎస్.కొండయ్య, డీపీఎంఓ ఎం.రియాజ్‌బేగ్, చిన్నమండెం, ములకలచెరువు, నగిరిమడుగు, దేవలంపల్లి మెడికల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 5న రైతుబజార్ ప్రారంభం

మదనపల్లె : సంతగేటు సమీపంలో నూతనంగా ఆధునికీకరించిన రైతుబజార్‌ను నవంబర్ 5వ తేదీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రారంభిస్తారని జిల్లా వ్యవసాయ, వాణిజ్య, మార్కెటింగ్ అధికారి త్యాగరాజు తెలిపారు. బుధవారం వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ విడుదల చేసిన పత్రికా ప్రకటనలో 5వ తేదీ ఉదయం రైతుబజార్ ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని రైతులు, రైతుసంఘాలు, ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులు తమ పంట ఉత్పత్తులను రైతుబజార్‌కు తీసుకువచ్చి అమ్ముకోవాలని కోరారు.

ఉచిత సిలిండర్ల పంపిణీకి ఏర్పాట్లు చేయండి


గ్యాస్ ఏజెన్సీని పరిశీలిస్తున్న జేసీ ఆదర్శ రాజేంద్రన్

పీలేరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభోత్సవానికి తగిన ఏర్పాట్లు పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అన్నారు. బుధవారం జేసీ స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. రికార్డులు పరిశీలించి, కొత్తగా విధుల్లో చేరిన వీఆర్‌ఓలతో మాట్లాడారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం శ్రీ దుర్గా గ్యాస్ ఏజెన్సీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి విడత ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ ప్రారంభోత్సవం స్థానిక ఎమ్మెల్యేని ఆహ్వానించి చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ రఘురాం, తహసీల్దార్ భీమేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లను కొనసాగించండి


మాట్లాడుతున్న సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు

ములకలచెరువు : గత ప్రభుత్వం ప్రజా సేవ కోసం అమలు చేసిన వలంటీర్ వ్యవస్థకు వెంటనే పనులు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్. నరసింహులు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ అన్నారు. బుధవారం స్థానిక మండల కేంద్రంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వలంటీర్లను పక్కన పెట్టిందన్నారు. వలంటీర్ల కడుపు కొట్టడం మంచిది కాదని ప్రభుత్వానికి హితువు పలికారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నవబంర్ 4వ తేదీ పార్టీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

పెన్షన్లకు నగదు విడుదల

రామసముద్రం : మండలంకు నవంబర్ నెలకు సంబంధించి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు రూ.2 కోట్ల 65 లక్షల 94 వేలు రిలీజ్ అయినట్లు ఎంపీడీఓ భానుప్రసాద్ తెలిపారు. నవంబర్ 1 తేదీన ఉదయం 6 నుంచి పెన్షన్లు పంపిణీ ప్రారంభమవుతుందన్నారు. కేవలం 1, 2 తేదీలలో మాత్రమే పెన్షన్ పంపిణీ ఉంటుందని, 2వ తేదీ అర్ధరాత్రి 12 గంటలకు పెన్షన్ పంపిణీ వెబ్‌సైట్ మూసి వేయబడుతుందన్నారు. అందరు పెన్షన్ లబ్ధిదారులు వీలైనంత వరకు 1వ తేదీన అందుబాటులో ఉండి పెన్షన్లు తీసుకోవాలని ఆయన కోరారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఇద్దరు విద్యార్థినులు


విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పీలేరు : రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు గూడరేవుపల్లె జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపికైనట్లు హెచ్ఎం నాగరత్నమ్మ తెలిపారు. బుధవారం ఎంపికైన విద్యార్థినులను అభినందించారు. ఆమె మాట్లాడుతూ ఇటీవల చిత్తూరులో జరిగిన అథ్లెటిక్ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన ఎం.పూజిత సీనియర్స్ విభాగంలో, పి.పల్లవి జూనియర్ విభాగంలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. నవంబర్ 3, 4 తేదీల్లో శ్రీకాకుళంలో జరిగే రాష్ట్ర పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు.





బీఎస్పీ మండలాధ్యక్షుడి ఎన్నిక

ములకలచెరువు : ములకలచెరువు మండల బీఎస్పీ అధ్యక్షుడిగా ఎం.మల్లప్పను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం స్థానిక మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో తంబళ్లపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జ్ పి.మల్లికార్జున ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండకట్టడానికి బీఎస్పీ ముందుంటుందని తెలియజేశారు.

హామీలు వెంటనే అమలు చేయాలి


మాట్లాడుతున్న యూటీఎఫ్ నేత సుధాకర్‌నాయుడు

గుర్రంకొండ : ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు సుధాకర్‌నాయుడు అన్నారు. బుధవారం గుర్రంకొండలో ఏర్పాటు చేసిన యూటీఎఫ్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెరుగైన పీఆర్‌సీ, ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలన్నారు. డీఏ బకాయిలు వెంటనే రిలీజ్ చేయాలన్నారు. ప్రతి ఆరు నెలలకు డీఏ బాకాయిలు సకాలంలో చెల్లించాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమిస్తామని అన్నారు. ప్రతినెలా ఒకటో తేదీన ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పీఎఫ్ రుణాలు, లీవ్‌లకు సంబంధించిన నగదును వెంటనే విడుదల చేయాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యల పట్ల యూటీఎఫ్ నిరంతం పోరాడుతుందన్నారు. సమావేశంలో యూటీఫ్ జిల్లా కౌన్సిలర్ భాస్కర్‌రెడ్డి, నాయకులు యూసూఫ్‌ఆలీ, విద్యాసాగర్, వెంకటయ్య, రెడ్డెన్న, రవినాయక్‌లు పాల్గొన్నారు.

ముగిసిన గ్రామసభలు

నిమ్మనపల్లె : రీసర్వే పూర్తయిన గ్రామాల్లో రెవెన్యూ గ్రామసభలు ముగిశాయని తహసీల్దార్ ధనుంజయులు తెలిపారు. బుధవారం చివరగా అగ్రహారం గ్రామంలో రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ సభలలో అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. జాయింట్ మ్యుటేషన్ విభజన, సర్వే నంబర్, సబ్ డివిజన్‌లలోని వ్యత్యాసాలు, మ్యుటేషన్‌లోని పొరపాట్లు, ఆన్‌లైన్‌లో పట్టాదారు పేరు, తండ్రి పేరు, భూమి విస్తీర్ణంలో వ్యత్యాసాలపై రైతులు వినతిపత్రాలను అందజేశారు. గ్రామసభల్లో తవళం 73, చౌకిళ్లవారిపల్లె 14, నిమ్మనపల్లె 283, అగ్రహారం 94, సామకోటవారిపల్లె 96 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. 15 రోజుల్లోగా సంబంధిత సమస్యలు పరిష్కరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీటీ సిరాజుద్దీన్, సర్వేయర్ గోపి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ ఐక్యత, సమగ్రతకు ప్రతీక వల్లబ్‌భాయ్ పటేల్


జాతీయ ఐక్యత ర్యాలీలో ఎన్‌సీసీ క్యాడెట్లు

పీలేరు రూరల్ : జాతీయ ఐక్యత, సమగ్రతకు ప్రతీక భారతదేశ ఉక్కుమనిషి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ అని ఎస్ఐ లోకేష్ అన్నారు. వల్లభాయ్ పటేల్ జయంతి (అక్టోబర్ 31), జాతీయ ఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పీలేరు పట్టణం ఎస్‌జీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ఎన్‌సీసీ క్యాడెట్లచే ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు. దేశానికి మొదటి హోం మంత్రిగా, ఉప ప్రధానిగా, సమాచార ప్రసారాల శాఖ మంత్రిగా విశేష సేవలందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి, ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ వెంకటరమణయ్య, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

మిట్స్‌లో విద్యార్థుల 'దాండియా'



కురబలకోట : దీపావళి సందర్భంగా అంగళ్లులోని మి ట్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు బుధవారం దాం డియా నృత్యం నిర్వహించారు. సాంప్రదాయ దుస్తు ల్లో నిర్వహించిన ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది.